## క్లుప్తంగా

### డిగ్రీ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థినుల ప్రతిభ


బి.కవితాబాయి


కె.హనిమిబాయి


డి.లక్ష్మీప్రసన్న

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ప్రకటించిన డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. బి.కాం కంప్యూటర్స్ విభాగంలో 700 మార్కులకు గాను తమ విద్యార్థినులు బి.కవితాబాయి 604, కె.హనిమిబాయి 602, డి.లక్ష్మీప్రసన్న 592 మార్కులు సాధించినట్టు తెలిపారు. విద్యార్థినులను కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపల్ నాతాని, వైస్‌ప్రిన్సిపల్ ఎంఆర్‌కె సతీష్‌బాబు, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి షేక్.సర్దార్, అధ్యాపకులు అభినందించారు.

### వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ చింపివేత



ఈపూరు: మండలంలోని శ్రీనగర్ గ్రామం వద్ద వేసిన వైఎస్సార్ సీపీకి చెందిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చించివేశారు. అనేక సంవత్సరాలుగా వైఎస్సార్ సీపీ వివిధ కార్యక్రమాలకు గ్రామస్తులు ఆ స్థానంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుంటారు. అయితే నారా లోకేశ్ నిర్వహిస్తున్న యువగళం సందర్భంగా తెదేపా పార్టీకి చెందిన వారు ఫ్లెక్సీని కావాలనే చింపివేశారని శ్రీనగర్ గ్రామస్తులు తెలిపారు. ఇలాంటి రెచ్చగొట్టే కార్యక్రమాలకేనా యువగళం ప్రవేశపెట్టిందని గ్రామస్తులు అంటున్నారు. జరిగిన సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

### ముఖ్యమంత్రిపై పూర్తి విశ్వాసం

నకరికల్లు: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీరుస్తారన్న పూర్తి విశ్వాసం తమకు ఉందని ఏపీ ఎన్జీఓస్ సంఘం నరసరావుపేట తాలూకా అధ్యక్షుడు ఎం.రామకృష్ణ తెలిపారు. విజయవాడలో ఆగస్టు 21,22వ తేదీల్లో నిర్వహించనున్న ఏపీ ఎన్జీఓస్ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను గురువారం నకరికల్లులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 21వ రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఎన్జీఓల సమస్యలపై ముఖ్యమంత్రికి విన్నవించేందుకు రాష్ట్రంలోని 10వేల మంది ఉద్యోగులు కూడా పాల్గొననున్నట్లు చెప్పారు. మహాసభను విజయవంతం చేసేందుకు ప్రతి మండలంలోనూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నరసరావుపేటలోని ఎన్జీఓ హోం నుంచి సభకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని శాఖల ఉద్యోగులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరా రు. ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఏపీ ఎన్జీఓస్ సంఘం తాలూకా కార్యదర్శి మాదాసు ఆనందనాథ్, ట్రెజరర్ సీహెచ్.కోటిరెడ్డి పాల్గొన్నారు.


చిలకలూరిపేటలో నిర్మాణమైన 100 పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని


డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రజిని. పక్కన వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారి ఎంటీ కృష్ణబాబు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి రజిని

–చిలకలూరిపేట

# రీసర్వేకు ప్రజలు సహకరించాలి

వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు పథకం కార్యక్రమం వినుకొండ పట్టణంలో చేపట్టడం జరిగిందని కమిషనర్ వెంకయ్య గురువారం తెలిపారు. పట్టణంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్లను అనుబంధం చేస్తూ కొత్త సర్వే రికార్డులు తయారు చేయడం జరుగుతుందని, రీసర్వే ప్రక్రియలో భాగంగా వందేళ్ల తరువాత పట్టణంలో జరుగుతున్న రీసర్వేను ప్రజలు సద్వినియోగించుకొని అధికారులకు సహకరించాలని కోరారు.

**నెలఖారులోగా పూర్తి చేస్తాం**

శావల్యాపురం: రీసర్వే పనులు ఈనెలఖారులోగా పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టినట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు వెల్లడించారు. కనమర్లపూడి రెవెన్యూ గ్రామపరిధిలో 1435 మంది రైతులకు భూహక్కు పత్రాలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలో అర్హత కలిగిన రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీ చేసిన అనంతరం ఆయా రైతుల పొలాల్లో సరిహద్దు రాళ్లు వేస్తామన్నారు. పొట్లూరు రెవెన్యూ పరిధిలో రికార్డు పనులు పూర్తి చేశామన్నారు. మండలంలోని వేల్పూరు, శానంపూడి, పిచికలపాలెం రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సచివాలయ సర్వేయర్లు సారథ్యంలో రోవర్ యంత్ర పరికరాలు ద్వారా రైతుల సమక్షంలో భూములు కొలతలు పనులు పూర్తి చేశామని అనంతరం రైతులకు ఫాం 9 (2) నోటీసులు అందజేశామన్నారు. రెవెన్యూ అధికారులు సారథ్యంలో రికార్డు పనులు శరవేగంగా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈనెలఖారులోగా రీసర్వే పనులు పూర్తి చేస్తామన్నారు. అనంతరం కనమర్లపూడి రెవెన్యూ పరిధిలో రైతులకు పంపిణీ చేయనున్న భూహక్కు పత్రాలను ప్రదర్శించారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఆర్ఐ పి.నాసరయ్య, వీఆర్వోలు ఉప్పుటూరి మంగయ్య, డి.రాధలు ఉన్నారు.


రైతులకు పంపిణీ చేయనున్న భూహక్కు పత్రాలను ప్రదర్శిస్తున్న అధికారులు

# పాడిరైతుల అభ్యున్నతికి చర్యలు

శావల్యాపురం: జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ద్వారా పాడి పోషకుల అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం మండలంలోని పోట్లూరు గ్రామ సచివాలయంలో జగనన్న పాలవెల్లువ, పాడిరైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా ఆదాయం ఆధారంగా ఒక్కో రైతుకు రూ. 30 వేల నుంచి రూ.ఒక లక్ష 60 వేల బ్యాంకుల ద్వారా కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. పాడి గేదెలు, జీవాలు, గొర్రెలు నిర్వహణ ఖర్చుల నిమిత్తం అతి తక్కువ వడ్డీ రేటు రుణాలు బ్యాంకులు ద్వారా మంజూరు చేయిస్తామన్నారు. సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీ ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. ఇందులో భాగంగా మండలంలో 1300 మంది రైతులకు రుణాలు ఇస్తామన్నారు. అనంతరం గ్రామంలో పాడిరైతుల నుంచి వీవోఎలు సేకరించిన దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోపూరి జ్యోతి, పశువైద్యాధికారి గణేష్‌కుమార్, ఏపీవో జి.వాసుబాబు, పంచాయతీ కార్యదర్శి కోమటినేని అశోక్ చౌదరి, సీసీ ఖాజావలీ, ఉన్నారు.


వీవోఎల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు

## నవోదయంపై అవగాహన


మాట్లాడుతున్న అధికారులు


సమావేశానికి హాజరైన అర్జీదారులు

గతనెల 14న నిర్వహించిన నవోదయంలో వ్యాపారాల కోసం అర్జీలు పెట్టుకున్న ఎస్సీ, ఎస్టీలకు గురువారం కలెక్టరేట్‌లో వాటిపై అవగాహన నిర్వహించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రతినెలా 14వ తేదీన ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధి కోసం నవోదయం నిర్వహిస్తున్న విషయం విదితమే. జిల్లా పరిశ్రమల అధికారి పి.వెంకటేశ్వ రావు, ఉద్యానవన శాఖ అధికారి బీజే బెన్నీ, నోడల్ అధికారి పి.సంజీవ రావు వివిధ రకాల వ్యాపారాలు, తద్వారా పొందాల్సిన బ్యాంకు రుణాల గురించి వివరించారు.

–నరసరావుపేట

### 92 శాతం పింఛన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక–సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ గురువారం మూడవ రోజు 92 శాతం పూర్తి చేశారు. మొత్తం 16 సచివాలయాల పరిధిలో 9193 మందికి గాను రూ.2,53,46,250లు పంపిణీ చేయాల్సి ఉంది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందిస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేలిముద్రలు పడని లబ్ధిదారుల ఇళ్లకు ఆయా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు వెళ్లి వారి ఐరిష్ వేసి పింఛను నగదు అందిస్తున్నారు. ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

### నేడు యడ్లపాడులో ఉచిత హోమియో వైద్యశిబిరం

యడ్లపాడు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జిబాబు, ట్రెజరర్ ఏవీ శివయ్య తెలిపారు. మండల కేంద్రమైన యడ్లపాడు రచ్చబండ సెంటర్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు తహసీల్దార్ ఎన్. నాగమల్లేశ్వరరావు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అన్ని రకాల వ్యాధులు, దీర్ఘ కాలిక సమస్యలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఈ శిబిరంలో చిలకలూరిపేట పట్టణానికి చెందిన శ్రీవల్లీ హాస్పిటల్ హోమియో వైద్య నిపుణులు పీవీ సునీల్ కుమార్ హాజరై రోగులకు సలహాలు, సూచనలు చేస్తారని, ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### సేవ్ ఇండియా విజయవంతం చేయాలి

చిలకలూరిపేటటౌన్: క్విట్ ఇండియా స్ఫూర్తితో మోదీని గద్దె దింపి దేశాన్ని కాపాడుకోవాలని వామపక్ష కార్మికసంఘాల నాయకులు చెప్పారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 9తేదీ విజయవాడలో జరగనున్న ధర్నా ను విజయవంతం చేయాలని చెప్పారు. ఇందులో భాగంగా పల్నాడు జిల్లాలో కార్యక్రమం ప్రచారం చేయటానికి ప్రచార జీపు యాత్ర శుక్రవారం ఉదయం చిలకలూరిపేటలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వై.రాధాకృష్ణ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు, సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు పేరుబోయిన వెంకటేశ్వర్లు, బొంత భగత్‌సింగ్, పాలపర్తి సురేష్ పాల్గొన్నారు.

### కమిటీల గడువు పొడిగింపు

రొంపిచర్ల: మండలంలోని ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల మేనేజ్‌మెంట్ కమిటీల గడువును మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పొడిగించిన ఆరు మేనేజ్‌మెంట్ కమిటీల్లో నాలుగు మేనేజ్‌మెంట్ కమిటీలు పాతవారే తిరిగి నియామకం కాగా, రొంపిచర్ల, సంతగుడిపాడు పీఏసీఎస్‌లకు నూతన కమిటీలను నియమించారు. నూతనంగా రొంపిచర్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా మేడికొండ వీరారెడ్డి, సంతగుడిపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా చింతగుంట అంజిరెడ్డిని ప్రభుత్వం నియమించింది. అలాగే విప్పర్ల రెడ్డిపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా పాలిమేర వెంకటరెడ్డి, బుచ్చిబాపన్నపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా కేతు పెద్దచౌడారెడ్డి, సుబ్బయ్యపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా వట్టికొండ ఆంజనేయులు, అన్నవరం పీఏసీఎస్ చైర్ పర్సన్‌గా ద్రోణాదుల చిన రమణారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగించారు.

# సమస్యలకు సైన్స్ ప్రాజెక్ట్‌లు పరిష్కారం చూపాలి

**డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్**

నరసరావుపేట రూరల్: ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపే బాల శాస్త్రవేత్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్ట్ తయారు చేసే విధానంపై సైన్స్ ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్ మాట్లాడుతూ సమాజంలోని సమస్యలపై బాల్యదశ నుంచి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా వాటికి పరిష్కార మార్గాలను చూపే బాల శాస్త్రవేత్తలుగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. విద్యార్థులు తయారు చేసే ప్రాజెక్ట్‌ల ద్వారా జిల్లాకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఓ మధుకుమార్, ఏఎంఓ శ్రీనివాసరావు, జీసీడీఓ రేవతి, జిల్లా అకడమిక్ కో ఆర్డినేటర్ సీతారామయ్య, రీసోర్స్ పర్సన్స్ నాగేశ్వరరావు, అప్పారావు, రాజశేఖర్ పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్

# సంక్షేమం అర్హుల దరిచేరాలి

**జెడ్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి**

రొంపిచర్ల: మండలంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని జెడ్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి ఎండీవో కె.మ్యాథ్యూబాబు అధ్యక్షత వహించారు. జెడ్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ మాట్లాడుతూ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపన కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది సమయ పాలన పాటించాలని అన్నారు. మండలంలో అధికారులు సమన్వయంగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి వివరించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు టేక్ హోం రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఓబుల్ రెడ్డి

## రోడ్డు ప్రమాదంలో ఆర్‌ఎంపీ దుర్మరణం



డాక్టర్ నబీషా (ఫైల్)

రొంపిచర్ల: మండలంలోని అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారిపై రొంపిచర్ల, సంతగుడిపాడు మధ్యలో ప్రమాదవశాత్తు మోటారు సైకిల్ డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో కర్లకుంట గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ షేక్ అబ్దుల్ నబీషా (40) గురువారం మృతి చెందారు. రొంపిచర్ల గ్రామం నుంచి మోటార్ సైకిల్‌పై డాక్టర్ నబీషా కర్లకుంట గ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. మోటార్ సైకిల్ డివైడర్‌ను ఢీకొట్టటంతో తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయిన నబీషాను చూసిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. నబీషాను నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైద్యశాల్లో డాక్టర్ నబీషా మృతదేహాన్ని ఆర్‌ఎంపీ, పీఎం పారా మెడికల్ అసోసియేషన్ నాయకులు సందర్శించి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన నాయకుల్ల ఆర్‌ఎంపీ డాక్టర్లు డాక్టర్ వాకా అంకిరెడ్డి, జోగేశ్వరబాబు, భాస్కర్‌రెడ్డి, సంగీతరావు, హరిబాబు, మస్తాన్‌వలి, అంజిరెడ్డి, గోదా రమేష్ కుమార్, వెంకటేశ్వర్లు, నాసరయ్య, రమేష్ బాబు ఉన్నారు.

## కారు ఢీకొన్న ప్రమాదంపై కేసు నమోదు

నాదెండ్ల: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని తండ్రీకొడుకులు గాయాలపాలైన ప్రమాదంపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జె బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు చిలకలూరిపేట మద్దినగర్‌లో నివాసం ఉంటున్న తండ్రీకొడుకులు షేక్ మౌలాలి, మస్తాన్‌వలి ఈ నెల 2న గణపవరంలో పింఛను సొమ్ము తీసుకుని తమ ద్విచక్ర వాహనంపై తిరిగి చిలకలూరిపేటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిని దాటుతుండగా మంగళగిరి నుంచి నంద్యాల వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. దీంతో తండ్రి మౌలాలి తీవ్రగాయాలపాలుకాగా జీజీహెచ్‌కు తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదంలో గాయాలపాలైన మస్తాన్‌వలి చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ సుబ్బారాయుడును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### వృద్ధుడి జాడ కోసం ఫిర్యాదు



నాదెండ్ల: సాతులూరు గ్రామానికి చెందిన బాపయ్య చౌదరి ఈ నెల 1 నుంచి కనిపించటం లేదంటూ నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం ప్రకారం.. బాపయ్య చౌదరి కొన్నేళ్ళ క్రితం ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తు, పన్నెండేళ్ల క్రితం పెరాలసిస్ రావడంతో ఇంటికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో ప్రతినెలా రూ.3 వేలు పింఛను పొందుతున్నాడు. ఈ నెల 1వ తేదీన పింఛను నగదు తీసుకున్న బాపయ్య చౌదరి, నగదును ఇంట్లో కుటుంబ సభ్యులకు అందించాడు. ఆ తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకులాడినా జాడ లేకపోవటంతో, చౌదరి భార్య సీతా మహాలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు ఎస్సై జె.బలరామిరెడ్డి 9440 900881 నంబరుకు సమాచారమందించాలని కోరారు.

### సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని హనుమాన్ నగర్ సచివాలయంలో పనిచేస్తున్న ఇంజినీర్ సెక్రటరీ బలరాం నాయక్‌ను సస్పెండ్ చేసినట్లు కమిషనర్ వెంకయ్య తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ హౌసింగ్ పథకంలో లబ్ధిదారులకు ఇల్లు కట్టకుండానే బిల్లులు మంజూరు చేసినందుకు క్రమశిక్షణా చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

# వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ


నాగిరెడ్డిపల్లిలో కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామి రెడ్డి


వినుకొండ 23వ వార్డులో కిట్లను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్లు


నాదెండ్లలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ కురుకుంట్ల వెంకటరెడ్డి

వినుకొండ(నూజెండ్ల) : పట్టణంలోని 23వ వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను కౌన్సిలర్లు షేక్ షకీలా, తుమ్మలగోడు నన్నేసాలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం గత ప్రభుత్వాల కంటే ఎన్నో రెట్లు అధికంగా అందిస్తున్నారన్నారు. ఈ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్‌నగర్ సచివాలయ పరిధిలో ఉన్న 3వ అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎస్ ఖాన్, ఎస్ నాగమ్మ, గౌస్‌బాషా, సెక్టార్ సూపర్‌వైజర్ మరియకుమారి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ పాల్గొన్నారు.

**నూజెండ్ల మండలంలో....**

మండలంలోని ములకలూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ పంపిణీ చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసే కిట్లలో అధిక పోషకాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**బొల్లాపల్లి మండలంలో...**

బొల్లాపల్లి: మండలంలోని లాలిపురం మేళ్ళవాగు, బొల్లాపల్లి, మూగచింతలపాలెం, కనుమలచెరువు అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ కిట్స్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా లాలిపురం అంగన్‌వాడీ కేంద్రంలో టేక్ హోం రేషన్‌ను గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం భుజించాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణలో పోషక విలువలు అధికంగా ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారన్నారు. ఇంటికే రేషన్ వలన గర్భిణులు, బాలింతలకు సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో లాలిపురం సర్పంచ్ మంగాబాయి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వి. శ్రీదేవి, షేక్ మస్తాన్ బి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

**వినుకొండ పరిధిలో...**

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి పాల్గొని గర్భిణులకు, బాలింతలకు టేక్ హోం రేషన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పోషకాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

**నాదెండ్లలో...**

నాదెండ్ల: మంచి పౌష్టికాహారంతో తల్లి బిడ్డలు మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని నాదెండ్ల సొసైటీ చైర్మన్ కురుకుంట్ల వెంకటరెడ్డి చెప్పారు. గొరిజవోలు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు అందించారు. ఈ నెల నుంచి ఇక ప్రతినెలా గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ కార్యక్రమంలో భాగంగా పోషకాహార కిట్లు అందిస్తున్నట్లు చెప్పారు. గర్భిణులు సమగ్రమైన పోషకాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యకరమైన బిడ్డలు పుట్టడంతో పాటూ సమృద్ధిగా తల్లిపాలు పడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోషకాహార లోప నివారణకు విశేష కృషి చేస్తున్నదని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పోషకాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తల్లిపాల విశిష్టతను గురించి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ సీడీపీవో నిర్మలాదేవి, సూపర్‌వైజర్ కె. పద్మావతి, జీఎంఎస్‌కే లక్ష్మీప్రసన్న, కార్యదర్శి అహమ్మద్, ఏఎన్ఎం విజయ కుమారి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### 9 నుంచి 'నా భూమి-నాదేశం'

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం, సచివాలయం సిబ్బందితో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషా మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఈనెల 9 నుంచి నా భూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆగస్టు 9న ప్రధానమంత్రి సందేశంతో శిలాఫలకం ఆవిష్కరణ, ఆగస్టు 11న పర్యావరణం పచ్చదనాన్ని కాపాడడం కోసం వసుధకు వందనంలో భాగంగా మొక్కలు నాటాలన్నారు. తదుపరి ఆగస్టు 15 వరకు అన్ని పంచాయతీల్లో మొక్కలు నాటడంతో పాటు ఆయా పంచాయతీల్లో దేశభక్తి, స్వాతంత్ర్య సమరయోధులు, వీరులకు సన్మానం, సత్కారం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, ఖాళీ స్థలాల్లో అమృత్ సరోవర్ ఏర్పాటు చేసిన చెరువు కట్టలపై తదితర ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ఆయా పంచాయతీల్లో తప్పనిసరిగా పీఎం సందేశంతో కూడిన శిలాఫలకం ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో ఏపీఓ ఎస్. ఆంజనేయ రాజు, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com